
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





మద్దూరు గ్రామ సమీపంలో జొన్నపంటపై కమ్మేసిన పొగమంచు

భలే మంచు రోజు

9 గంటలైనా వీడని మంచు తెరలు



చాగలమర్రిలో కమ్మేసిన పొగమంచు

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిని మంచు దుప్పటి కప్పేసింది. నాలుగు రోజులుగా మంచు తీవ్రత పెరిగిపోయింది. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడడం లేదు.. జాతీయ రహదారితోపాటు గ్రామీణ రోడ్లలో వాహనదారులు, పాదచారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. పెరిగిన మంచు తీవ్రతతో పిల్లలు, వృద్ధులు బాగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలు మంచుతో మునిగిపోయి కనిపిస్తున్నాయి.. క్రమం తప్పకుండా ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు సాయంత్రానికి షెడ్యూల్ మార్చుకోవాల్సి వస్తోంది. వాహన డ్రైవర్లు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.



చాగలమర్రి 40వ జాతీయ రహదారిపై పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

కల్లు గీత కార్మికులకు మద్యం షాపులు

- జిల్లాలో పది శాతం దుకాణాలను కేటాయించిన ప్రభుత్వం
- 27 నుంచి టెండర్ దరఖాస్తుల స్వీకరణ



టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న అధికారులు

నంద్యాల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం షాపుల్లో కల్లు గీత కార్మికులకు పది శాతం కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 335 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో భాగంగా నంద్యాల జిల్లాలో ఏ కులానికి ఎన్ని మద్యం షాపులు రానున్నాయన్న వివరాలను జిల్లా అధికారులు శుక్రవారం వెల్లడించారు. కలెక్టర్ బి.రాజకుమారి, డీఆర్వో రామునాయక్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ముస్తాక్ అహమ్మద్, ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, గీత కులాల ప్రతినిధుల సమక్షంలో షాప్ ఏ యూనిట్ (మున్సిపాలిటీ - మండలం)లో ఏ ఉప కులానికి వస్తుందో మాపింగ్ చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టెండర్లలో ఆయా కులాల వారీగా కేటాయింపులు చేశారు. ఆళ్లగడ్డ మద్యం షాపు గౌడ్ కులానికి కేటాయించారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో 3 మద్యం షాపులు గౌడ్ ఉప కులాలకు ఇచ్చారు. డోన్ సబ్ డివిజన్‌లో ఈడిగ ఉప కులాలకు 9 షాపులు ఇచ్చారు. నంద్యాల సబ్ డివిజన్‌లో 7 మద్యం షాపులను ఈడిగ ఉప కులాల వారికి ప్రకటించారు. నందికొట్కూరు ప్రాంతంలో ఈడిగ ఉప కులాలకు 10 షాపులు ఉంటాయని పేర్కొన్నారు. పాములపాడు మండలంలో ఈడిగ ఉప కులాలకు 8 షాపులు, జూపాడుబంగ్లా మండలంలో ఈడిగ ఉప కులాలకు 5 షాపులు కేటాయించారు. పగిడ్యాల మండలంలో గౌడ ఉప కులాలకు 11 మద్యం షాపులు ఉంటాయని చెప్పారు. డోన్ రూరల్‌లో ఈడిగ ఉప కులాలకు 6 షాపులు, కొత్తపల్లె మండలంలో గౌడ్ ఉప కులాలకు 2మద్యం షాపులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

- ప్రభుత్వం మద్యం షాపుల్లో కల్లు గీత కార్మికులకు పది శాతం కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు టెండర్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వచ్చిన టెండర్లను ఫిబ్రవరి 7వ తేదీన ఓపెన్ చేసి మద్యం దుకాణదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత గల ఆయా కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



గాలేరు నగరి కాల్వకు చేసిన సిమెంట్ లైనింగ్

శాపంగా మారిన సిమెంట్ లైనింగ్

- బోర్లలో తగ్గిన భూగర్భ జలాలు
- రైతుల నోట్లో మట్టి
- కమీషన్ల కోసమే సిమెంట్ లైనింగ్ పనులు చేసిన గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వంలో కమీషన్ల కోసమే గాలేరు-నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేశారని బనగానపల్లె ప్రాంత ప్రజలు ఆక్రోశిస్తున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు స్వలాభం కోసం ఈ లైనింగ్ పనులతో భూగర్భ జలాలు అడుగంటిపోయేలా చేసి తమకు నష్టం చేశారని రైతులు విమర్శిస్తున్నారు.


బనగానపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు గాలేరి-నగరి కాల్వ పనులకు ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. కృష్ణానది వరదనీటిని సద్వినియోగం చేసుకోవడానికి ఈ పథకాన్ని అప్పటి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు ప్రారంభించి పనులు పూర్తి చేశాయి. 1988లో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు పనులు 2005 నుంచి ప్రారంభం అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టులోని 38 టీఎంసీల మిగులు జలాలను 30 రోజుల్లో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా తీసుకొని రాయలసీమలోని 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. అయితే ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రాయలసీమ జిల్లాలకు తోడు నెల్లూరు జిల్లాను కూడా చేర్చి మరో 2.14 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని విస్తరించారు. మొత్తం రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు 4.79 లక్షల ఎకరాలకు సాగునీరు, అలాగే 10 లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు గాలేరు నగరి పథకానికి విస్తరించారు.

సిమెంట్ లైనింగ్ పనులతో నష్టపోయిన రైతులు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గాలేరు నగరి మట్టికట్ట స్థానంలో ఇరువైపులా, కింద సిమెంట్ లైనింగ్ పనులు చేయించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ నుంచి గండికోట మీదుగా త్వరగా కడప జిల్లాకు నీరు తరలించేందుకు సిమెంట్ లైనింగ్ పనులు చేశారు. 2021లో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ సమీపంలోని గాలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు 57 కిలోమీటర్ల వరకు మట్టికట్టతో ఉన్న గాలేరు నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులకు టెండర్లు పిలిచారు. డీఎస్ఆర్, వీఏఆర్‌కెఎస్ కంపెనీలు జాయింట్ వెంచర్‌తో 57 కిలోమీటర్లకు 915 కోట్లతో టెండర్లను 2021 ఫిబ్రవరి నెలలో దక్కించుకొని సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేశాయి.

మట్టికట్టతో పెరిగిన భూగర్భ జలాలు

గాలేరు నగరి సుజల స్రవంతిలో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57 కిలోమీటర్ల మేర కాలువ తవ్వి రైతులకు సాగు, తాగు నీరును అందిస్తున్నారు. గాలేరు నగరి మట్టి కట్ట నిర్మాణం వల్ల పాణ్యం, బనగానపల్లె, అవుకు, సంజామల మండలాల్లోని పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో నీరు పెరిగి రైతులు రెండుసార్లు పంటలు పండించుకోవలనే ఉద్దేశంతో మట్టికట్టతో గాలేరు నగరి పనులు పూర్తి చేశారు.



రైతులకు అన్యాయం



పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు మండలం అవుకు హెడ్ రెగ్యులేటర్ వరకు గాలేరు నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయడం వల్ల మా ప్రాంత రైతులకు అన్యాయం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లాకు త్వరగా వరద నీరు తీసికెళ్లడానికే ఈ పని చేసింది. భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోయి వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తనుంది.

- బెడదల మహేశ్వరరెడ్డి, సర్పంచ్ పాతపాడు, బనగానపల్లె మండలం

భూగర్భ జలాలు తగ్గిపోయాయి

గాలేరు నగరి కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టడం దారుణం. ఈపనుల వల్ల ఈ పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లలో నీరు తగ్గుతోంది.

-దస్తగిరి, రైతు యాగంటిపల్లె, బనగానపల్లె మండలం

అడుగంటిన భూగర్భ జలాలు

పాణ్యం నుంచి బనగానపల్లె, అవుకు, సంజామల మండలం మీదుగా కడప జిల్లా దాకా గాలేరు నగరి కాల్వకు ఇరువైపులా, అడుగు భాగంలో సిమెంట్ లైనింగ్ పనులు చేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయాయి. పాణ్యం, బనగానపల్లె , కోవెలకుంట్ల, అవుకు మండలాల్లోని వ్యవసాయ పొలాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కడప జిల్లాకు సాగు, తాగునీరు మళ్లించేందుకు అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు తమ కమీషన్ల కోసం సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టి తమకు అన్యాయం చేశారని ఆ ప్రాంత రైతులు అంటున్నారు. గతంలో అక్కడక్కడ గాలేరు నగరి కాల్వలో బోర్లు వేస్తామని మభ్యపెట్టారని, ఇంత వరకు ఎక్కడా బోర్లు వేయలేదని అంటున్నారు.

చేపలకు కోళ్ల వ్యర్థాలు!

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు



చేపల చెరువుకు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

గడివేముల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలన్న ఉద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి ముంపు వాటిల్లుతున్నా అధికారులు మాముళ్ల మత్తులో ఈ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లోని కొందరు రైతులు తమ పొలాల మట్టిని గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి విక్రయించారు. పొలాల్లో మట్టిని తవ్వగా ఏర్పడిన భారీ గుంతల్లో కొందరు ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపల సాగు చేపట్టారు. చేపలకు మేతగా వేరుశనగ చెత్త, తవుడు, సోయాబిన్‌మిలెడ్‌లను వాడాల్సి ఉంది. సంప్రదాయ మేతను వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల మేర ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు కొందరు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపలకు కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. పట్టపగలే ఆటోలు, వ్యాన్‌లలో కోళ్ల వ్యర్థాలను నంద్యాల, గడివేముల నుంచి చేపల చెరువులకు తరలిస్తున్నారు.

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు

సాధారణ మేత వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ పెరిగితే, కోళ్ల వ్యర్థాలు తిన్న చేపలు మరింత బరువు పెరుగుతున్నాయి. సాధారణ మేతతో పోలిస్తే కోళ్ల వ్యర్థాలు తక్కువ ధరకు వస్తుండటంతో కొందరు చేపల చెరువుల యజమానులు వీటినే వినియోగిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి గొర్రెల సంత వద్ద నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి డ్రమ్ములలో చికెన్ వ్యర్థాలను తీసుకొని భారీ వాహనాల ద్వారా చేపల చెరువు వద్దకు చేరవేస్తున్నారు. పట్టపగలే కోళ్ల వ్యర్థాల రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.



చేపల చెరువులో కోళ్ల వ్యర్థాలు

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలను వేయడం చట్టరీత్యా నేరం. గడిగరేవుల చేపల చెరువులలో కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారన్న సమాచారం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేపడుతున్నాం.

- ఏవీ రాఘవరెడ్డి, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ, నంద్యాల

నోటీసులు జారీ చేశాం:

కోళ్ల వ్యర్థాలతో చేపలు సాగు చేయడం చట్టరీత్యా నేరం. గడిగరేవుల చేపల చెరువుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. కోళ్ల వ్యర్థాలను వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

-వెంకటరమణ, తహసీల్దార్, గడివేముల

నిబంధనలు ఇలా..

కోళ్ల వ్యర్థాలు చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం జీవో నంబర్ 56ను జారీ చేసింది. ఈ జీవోను అమలు చేసేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో), ఎస్ఐ, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లతో, టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుబడిన వ్యర్థాలను నాశనం చేయడంతోపాటు డ్రైవర్ లైసెన్స్ రద్దు, వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమలు చేయాల్సి ఉంది. అయితే మండలంలో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శిశు సంక్షేమ శాఖ ఏపీడీగా లీలావతిదేవి



నంద్యాల, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా పని చేస్తున్న లీలావతిదేవికి జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఏపీడీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే ఆ శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఆమె పని చేస్తున్నారు. అయితే ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా ఎవర్నీ నియమించలేదు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఉద్యోగానికి రాజీనామా చేయాలని టీడీపీ నేతల ఒత్తిడి
- పలుమార్లు బెదిరించారని మృతుడి భార్య, మామ ఆరోపణ



సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, పోలీసులు ఇన్‌సెట్లో మృతుడు

వివరాలు 7వ పేజీలో

సెస్సు వసూళ్లలో లక్ష్యం అధిగమించాలి

జేడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన సెస్సు లక్ష్యాన్ని సాధించాలని, లేకపోతే చర్యలు తప్పవని మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సిబ్బందిని కడప మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో వివిధ అంశాలపై కడప నుంచి వచ్చిన జేడీ దిశా నిర్దేశం చేశారు. దళారులు, వ్యాపారుల అక్రమాలను నిరోధించాలని, దీని వల్ల సెస్సు ఆదాయం పెరగడంతో పాటు రైతులకు నష్టం జరగదని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా వేటు తప్పదని జేడీ స్పష్టం చేశారు. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల సెక్రటరీలతో రైతుల ఇబ్బందులపై పూర్తి శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలన్నారు. తూకం కాటాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, అవి సక్రమంగా పని చేస్తున్నదీ లేనిదీ నిఘా పెట్టాలని అన్నారు. నిబంధనల మేరకు రైతుల నుంచి చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ఇతరత్రా అధికంగా వసూలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న పెంచికలపాడు సీసీఐ కేంద్రంపై నిత్యం అధికారులు నిఘా పెట్టాలన్నారు. అక్కడ దళారులకు, వ్యాపారులకు ఏ మాత్రం అవకాశం లేకుండా రైతులు నేరుగా సీసీఐ కేంద్రానికే పత్తి అమ్మేలా అవసరమైన వసతులు కల్పించాలన్నారు. చెక్ పోస్టులను గట్టి బందోబస్తుతో నిఘా పెట్టాలని జీరో వ్యాపారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, కోడుమూరు సెక్రటరీ సుందర్‌రాజు, పాణ్యం సెక్రటరీ రెహిమాన్, పత్తికొండ సెక్రటరీ కార్నలీస్, ఏడీఎంలు నారాయణమూర్తి, రహిమాన్ పాల్గొన్నారు.


ప్రగతి బాటలో పాడి పరిశ్రమ

వ్యవసాయం తరువాత అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచే పాడి పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాల ఉత్పత్తి పెంచడం, పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ముందు చూపుతో వ్యవహరిస్తున్నాయి. పాడి రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తీసుకవచ్చి అండగా నిలుస్తున్నాయి. పాడి పరిశ్రమ ప్రగతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పశు వైద్య శిబిరాలను ప్రారంభించింది. ఈ నెల 31 వరకు పశువైద్య శిబిరాలు కొనసాగనున్నాయి.

పీకేసీసీ కార్డు పొందడానికి ఉండాల్సిన అర్హతలు

ఆవులు, లేదా గేదెలు కలిగిన పాడి రైతులైతే 2 నుంచి 9 వరకు పశువులు కలిగి ఉండాలి. అదే గొర్రెలు, మేకలు కలిగి ఉన్న రైతులు 20 నుండి 30 వరకు సంఖ్య ఉండాలి. పశువులు ఉన్నట్లు స్థానిక పశు వైద్యశాలలో ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. రైతు పీఎం కిసాన్ లబ్ధిదారుడై ఉండాలి. బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ పత్రం, పశువుల ధ్రువీకరణ కార్డుతో రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో సంప్రదించాలి.





కొలిమిగుండ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, పాన్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డు తరచూ మనకు వినిపించే గుర్తింపు కార్డులు. అయితే పశువులకూ ఓ గుర్తింపు కార్డు ఇచ్చి, అది పశు పోషకులకు ఉపయోగపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. పశువుల పేరుపై పశు పోషకులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నారు. మనిషి కుటుంబ, వ్యక్తిగత అవసరాలకు డబ్బు అవసరమైతే బంగారం, ఆస్తులు చూపి బ్యాంకులు, ప్రైవేటు సంస్థల వద్ద రుణం పొందుతారు. అలాగే పశు పోషణ కోసం డబ్బులు అవసరమైతే పాడి రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఈ పీకేసీసీ (పశు కిసాన్ క్రెడిట్ కార్డు) ద్వారా బ్యాంకుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల నుంచి గరిష్ఠంగా రూ.3 లక్షలకు వరకు రుణం పొందే అవకాశం కల్పించారు. తీసుకున్న రుణం 40 రోజుల్లో చెల్లిస్తే రైతుల నుంచి ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. ఏడు శాతం వడ్డీతో రుణాలు అందిస్తుండగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరో మూడు శాతం వడ్డీ చెల్లించే విధంగా వెసులుబాటు కల్పించాయి. 40రోజుల తర్వాత రుణం చెల్లించే రైతులు కేవలం ఒక శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పాల విక్రయాలతో వచ్చే నగదును జమ చేస్తూ సాధారణ క్రెడిట్ కార్డులా దీన్ని వినియోగించవచ్చు.

నంద్యాల జిల్లాలో పశువులు

ఆవులు - 1.20 లక్షలు, గేదెలు - 2.93 లక్షలు
మేకలు - 3.10 లక్షలు, గొర్రెలు - 8.82 లక్షలు

నంద్యాల జిల్లాలో పశు సంవర్ధక శాఖ లక్ష్యానికి మించి పీకేసీసీ కార్డులు పంపిణీ చేసింది. జిల్లాలోని బనగానపల్లె, పాణ్యం, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు డివిజన్‌లకు సంబంధించి 7200 పశు కిసాన్ కార్డులు పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యం కాగా, అధికారులు ఇప్పటికే 9386 కార్డులు రైతులకు పంపిణీ చేశారు. జిల్లాలో పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉన్నట్లు అధికారులతోపాటు, పాడి పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

- రైతులకు వరం పశు కిసాన్ క్రెడిట్ కార్డు
- జిల్లాలో లక్ష్యానికి మించి కార్డుల పంపిణీ
- పశువైద్య శిబిరాలతో విస్తృత సేవలు



పాడి రైతులకు ఇది మంచి అవకాశం

పశు పోషణకు రుణ సదుపాయం కల్పించడం అభినందనీయం. ప్రతి రైతూ ఉపయోగించుకోవాలి. 40 రోజుల్లో చెల్లిస్తే రైతుల నుంచి ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. ఏడు శాతం వడ్డీతో రుణాలు అందిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరో 3శాతం వడ్డీ చెల్లించే విధంగా వెసులుబాటు కల్పించారు. 40 రోజుల తర్వాత రుణం చెల్లించే రైతులు కేవలం ఒక శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పాల విక్రయాలతో వచ్చే నగదును జమ చేస్తూ సాధారణ క్రెడిట్ కార్డులా దీన్ని వినియోగించవచ్చు.

\- శ్రీరాముడు, రైతు

రాజ్ భవన్‌కు మహానంది మోడల్ స్కూల్ విద్యార్థిని

మరోసారి మోడల్ స్కూల్‌కు అరుదైన గౌరవం



గీతవాణి

మహానంది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గీతావాణికి జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అట్ హోమ్ కార్యక్రమానికి విజయవాడలోని రాజ్ భవన్‌కు రావాలని ఆహ్వానం అందింది. పాఠశాల ప్రిన్సిపాల్ కె. లక్ష్మణ్‌రావు శుక్రవారం మాట్లాడుతూ గవర్నర్ జాయింట్ సెక్రటరీ పేరున ఆహ్వానం అందినట్లు తెలిపారు. రాష్ట్రంలో అవకాశం పొందిన ఏడుగురు విద్యార్థుల్లో మహానంది ఏపీ మోడల్ స్కూల్ మహానంది నుండి విద్యార్థిని గీతావాణికి ఆహ్వానం రావడం గర్వకారణం అన్నారు. ఈ ఎంపిక పట్ల మోడల్ స్కూల్ సంయుక్త సంచాలకురాలు తాహెర్ సుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- దిగ్విజయంగా నిర్వహిస్తాం
- ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 22 నుండి మార్చి 1 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 22 న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలు మహానంది నుండి నంద్యాల పట్టణానికి బయలు దేరుతాయన్నారు. తిరిగి 23 వ తేది నంద్యాల పట్టణంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు తర్వాత రాత్రికి మహానందికి చేరుతాయని చెప్పారు. 24 న ఉదయం ప్రధాన ఆలయాల్లో పూజలయ్యాక సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం ఉంటుందని అన్నారు. 25 వతేది ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం సింహవాహన సేవ, 26 వ తేది ఉదయం రావణ వాహన సేవ, సాయంత్రం నంది వాహన సేవ, రాత్రి 10 గంటల నుండి లింగోద్భవ కాలంలో మహా రుద్రాభిషేకం, తెల్లవారుజామున 3 గంటల నుండి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఉంటాయని అన్నారు. అలాగే 27 వతేది ఉదయం శేష వాహన సేవ, సాయంత్రం పుష్ప పల్లకి సేవ, 28 ఉదయం అశ్వ వాహన సేవ, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 1 న ఉదయం త్రిశూల స్నానం, ధ్వజా అవరోహణం, సాయంత్రం తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో ప్రధాన ఆలయాల్లో భక్తులకు అన్ని సేవలను నిలిపి వేశామని, రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలను రద్దు చేశామని తెలిపారు. శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, దేవికారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు టెండర్లు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాటు పనులకు శుక్రవారం దేవస్థానం కార్యాలయంలో ఈవో శ్రీనివాసరెడ్డి సీల్ టెండర్ల ద్వారా బహిరంగ వేలాలు నిర్వహించారు. ఇందులో విద్యుత్ అలంకరణ, షామియానాలు, పార్కింగ్ స్థలంలో బారికేడ్ల ఏర్పాటు మొదలైన వాటికి సీల్ టెండర్ ప్రక్రియ ద్వారా తక్కువ కోడ్‌తో వేసిన కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు.

27న శ్రీకృష్ణదేవరాయల జయంతి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 27న ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించాలని జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జిల్లా బలిజ సంఘం కార్యాలయంలో కోనేటి చంద్రబాబు మాట్లాడుతూ గత కొంత కాలంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి విషయంలో సందిగ్ధం నెలకొందని, దానిని నివృత్తి చేస్తూ ఇప్పుడు స్పష్టమైన ఆధారాలతో నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో ఫిబ్రవరి 16 అని కొంత మంది, జనవరి 17న ఆయన జయంతిని జరపాలని మరి కొంత మంది వాదిస్తూ వచ్చారని, దీంతో జయంతి వేడుకలపై స్పష్టత కరువైందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి రాసిన మరీచి పరిణయం అనే కావ్యంలో రాయలవారి జన్మదినం గురించి ప్రస్తావించిందన్నారు. వికృతి నామ సంవత్సరం, పుష్యమాసం, కృష్ణపక్షం, ద్వాదశి, శుక్రవారం రాయలవారు జన్మించారని మోహనాంగి పేర్కొన్నట్లు పోలిశెట్టి సత్తిరాయుడు సమాచారం సేకరించారని పేర్కొన్నారు. కావున శ్రీకృష్ణదేవరాయల జయంతి జరుపుకునే వారందరూ జనవరి 27న మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

14వ రోజు 310 మంది ఎంపిక

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



కర్నూలు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం 14వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 484 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు, 1600 మీటర్ల పరుగు పరీక్షలో 345 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 215 మంది, లాంగ్‌జంప్‌లో 304 మంది, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 14వ రోజు 310 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి ఎస్పీ, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నత్త నడకన నగర పాలక భవనం



- నిలిచిపోయిన నిర్మాణ పనులు
- మూడు అంతస్తులకే పరిమితం
- రూ.28 కోట్లు ఖర్చు

చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసాము

నిర్మాణ పనుల బిల్లులు అప్‌లోడ్ చేసాం. సీఎఫ్ఎంఎస్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. గతంలో పెండింగ్‌లో ఉండే బిల్లులు కూడ నేను జాయిన్ అయ్యాక ప్రభుత్వానికి పంపించాను. త్వరలోనే నిర్మాణ పనులు వేగవంతమవుతాయి.

\-రాజశేఖర్, నగర పాలక సంస్థ ఎస్ఈ

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ నూతన భవన నిర్మాణం ఆగిపోయింది. రూ.28 కోట్లతో 2022 సంవత్సరం ఆగస్టు 1న అప్పటి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కమిషనర్, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. అన్ని అత్యాధునిక టెక్నాలజీతో రెండు బ్లాక్‌ను నిర్మించేలా పనులు ప్రారంభించి 29 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఇంకా మొదటి బ్లాక్ రెండు అంతస్తులు..రెండో బ్లాక్ ఒక్క అంతస్తు మాత్రమే నిర్మించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తారని కడపకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మధ్యలో ఒక నెల ఎలాంటి పనులు చేయకుండా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. అధికారులు తనకు సహకరించడం లేదని సదరు కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నారు.

రూ.9.50 కోట్ల పుష్కర నిధులు

పుష్కర నిధుల్లో మిగిలిన రూ.9.50 కోట్లు నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి ఉపయోగించాలనే తీర్మానాన్ని కౌన్సిల్‌లో ఆమోదించారు. మొత్తం రూ.28 కోట్ల అంచనాతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. మిగిలిన నిధులు ప్రభుత్వం, కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని తీర్మానించారు.

మరో బ్లాక్ ఆదిలోనే ఆగింది..

అయితే ఇప్పటికి కనీసం ఒక బ్లాక్ పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాకపోవడంతో ఇష్టానుసారంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. మరో బ్లాక్ నిర్మాణానికి పునాదులు తీసి ఒక్క అంతస్తు మాత్రమే నిర్మిస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడ ఆధునాతన భవన నిర్మాణం జరుగుతుండగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయంలోని కొన్ని విభాగాల్లో అనవసరంగా మరమ్మతు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. మరో బ్లాక్ నిర్మించాలనే ఉద్దేశంతో మేయర్‌ను కమిషనర్ రూమ్‌కు కేటాయించారు. కమిషనర్‌కు అడిషనల్ కమిషనర్ రూమ్ కేటాయించారు. అదే విధంగా స్టాండింగ్ కమిటీ రూమ్‌ను అడిషనల్ కమిషనర్‌కు కేటాయించారు. మొదటి బ్లాక్‌లో కనీసం అధికారులకు సంబంధించిన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం చేయడంతో పాటు భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

రూ.7 కోట్ల పెండింగ్ బిల్లులు..ముందుకు రాని కాంట్రాక్టర్

నూతన భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.7 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.28 కోట్లు అంచనా. అయితే 2023 డిసెంబర్‌లో కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వంలో రూ.2 కోట్లు చెల్లించారు. అయితే 2024 సంవత్సరంలో ఒక్కపైసా కూడ చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్లు తెలిసింది. అంతే కాకుండా నగర పాలక సంస్థ చెల్లించిన నిధులతో కేవలం గ్రౌండ్‌ఫ్లోర్‌కు సరిపోతుందని...కాంట్రాక్టర్ తన సొంత నిధులతో మొదటి బ్లాక్‌లోని రెండు అంతస్తులకు స్లాబ్ వేసినట్లు తెలిసింది. అంతే కాకుండా భవనాన్ని పర్యవేక్షిస్తున్న ముగ్గురు సూపర్‌వైజర్లకు గత ఏడు నెలలుగా జీతాలు కూడ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇంతే..



కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా ఒక్కపైసా కూడ బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బిల్లులు త్వరితగతిన చెల్లిస్తే నిర్మాణం అనుకున్న సమయంలో పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

గతంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ముడుపులు..?

ఇంత పెద్ద మొత్తంలో భవన నిర్మాణం జరుగుతుండటంతో గతంలో కొందరు అధికారులు, ఓ ప్రజాప్రతినిధికి కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా కార్పొరేషన్‌లో అప్పటి కీలక అధికారి వద్ద సహాయకుడిగా పని చేస్తున్న ఓ ఉద్యోగికి కూడా ఆ కాంట్రాక్టర్ పెద్ద మొత్తం చెల్లించినట్లు సమాచారం. ఈ విషయం ఆ అధికారికి తెలిస్తే ఎక్కడ తన ఉద్యోగానికి ఎసరు వస్తుందోనని భయంతో ఆ ఉద్యోగి జాగ్రత్త వహించారు. కేవలం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగేందుకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధికి ముడుపులు అందాయి. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు భవన నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధి ఒక్కసారిగా కూడా అటువైపు చూడలేదు.



కళాకారులను ఆదుకోవాలి

ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళాకారులకు రూ.6 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ కోరారు. కర్నూలులోని సీఆర్ భవన్‌లో శుక్రవారం సినీ డైరెక్టర్ బాబ్జితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది కళాకారులు ప్రభుత్వ ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. కళాకారులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఆర్గనైజింగ్ కార్యవర్గసభ్యులు రామారావు, జిల్లా కార్యదర్శి నాగరాజు, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొండా మనోహర్



కర్నూలు లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీబీఐ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొండా మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన సీబీఐ కేసులను ఈయన వాదిస్తారు. ఈయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. 1994లో ఆయన ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆయన గతంలో కర్నూలు కోర్టులలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఈయన నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు ఏ. రామసుబ్బారెడ్డి, ఎంఎల్. శ్రీనివాసరెడ్డి, ఎస్. చాంద్‌బాషా, వై. శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధునిక ప్రయోగశాల, జనిత స్కిల్ ల్యాబ్ ప్రారంభం



జనిత మోన్ స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు ఆధునిక ప్రయోగశాల జనిత స్కిల్ ల్యాబ్ అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో వారు జనిత మోన్ స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రతిష్టాత్మకమైన ఈ ల్యాబ్ విద్యార్థుల నాలెడ్జ్ యాడ్ స్కిల్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. మంజుల రాణి, వైస్ ప్రిన్సిపాల్ వి. ధనలక్ష్మి, కళాశాల ట్యూటర్స్ శోభారాణి, శాంతిభవాని, మంజుల, సరళ కుమారి పాల్గొన్నారు.

డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో 5వ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయి గోపాల్ విడుదల చేశారు. 214 మంది పరీక్షలు రాయగా 206 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 96 శాతం ఉత్తీర్ణత సాధించారని రీ వాల్యూయేషన్ కోసం కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, పరీక్షల విభాగం డీన్ కే. నాగరాజు శెట్టి, పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ కే. బాలకృష్ణయ్య శెట్టి పాల్గొన్నారు.

బీఈడీ 3వ సెమిస్టర్...

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 3వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 697 మంది పరీక్షలు రాయగా 306 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని-ఆస్పరి బైపాస్ లోని విరుపాపురం సమీపంలో జరిగే రోడ్డు ప్రమాదంలో ఆకుల నాగరాజు(45) మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. గూడూరు మండలం రేమట గ్రామానికి చెందిన నాగరాజు బంధువులతో కలిసి శుక్రవారం దహన సంస్కారాల కోసం విరుపాపురం వచ్చారు. రాత్రి 8గంటల సమయంలో ఆటోలో తిరిగి సొంత గ్రామానికి బయలుదేరారు. గ్రామ శివార్లలో ముందుగా వెళ్తున్న స్కూటర్‌ను అధిగమించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

డెంగీ కేసు నమోదు

వెల్దుర్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి డా.బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రాణి జ్వరం రావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సూదేపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, మేరీలు వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరం నిర్ధారణ అయింది. విద్యార్థిని కోలుకుంటుందని ఆరోగ్యంగానే ఉందని వైద్యులు వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- పలుమార్లు బెదిరించారని మృతుడి భార్య, మామ ఆరోపణలు



బండారి ఈరన్న (ఫైల్)

ఆలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలంలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్ శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం విషయంలో నెలకొన్న వివాదాలే హత్యకు కారణమయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బండారి ఈరన్న(50) ఐదేళ్లుగా పని చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక నాయకులు ఈరన్నను ఉద్యోగం వదిలేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఇదే విషయంపై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఉద్యోగాన్ని వదిలేయాలంటూ ఈరన్నపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. రాజీనామా చేయకపోతే అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఎంత చెప్పినా ఉద్యోగాన్ని వదిలేయకపోవడంతో స్థానికంగా ఉన్న కొందరు నాయకులు బండారి ఈరన్నపై కక్ష పెంచుకున్నారు. చివరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు విధులకు బైక్‌పై వెళ్తున్న ఆయనను వెంబడించి కత్తులతో దాడి చేశారు. హత్య చేసిన అనంతరం పరారయ్యారు. విషయం తెలుసుకున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్ఐ దిలీప్ కుమార్, క్లూజ్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హత్యకు గల కారణాలను భార్య, బంధువులు, గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి భార్య నాగలక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి, మామ మల్లయ్యలు మాత్రం ఈరన్న హత్యకు టీడీపీ నాయకులుగా ఉన్న మంగళి గోపి, రామదాసు, గాదెలింగ, గోవర్ధన్ కారణమని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం వదిలేయకపోతే హత్య చేస్తామంటూ బెదిరించారని, చివరకు అన్నంత పని చేశారని బోరున విలపించారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆయన కుమారుడు గిరీష్ గౌడ్ హత్య చేసిన వారికి అండగా నిలిచారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

హత్యా రాజకీయాలు సరికాదు : ఎమ్మెల్యే విరూపాక్షి

కూటమి ప్రభుత్వం ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడటం సరైన విధానం కాదని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న హత్యకు గురి కావడంతో ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఉద్యోగం కోసం కూటమి ప్రభుత్వం ఇలాంటి హత్యా రాజకీయాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనిత ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

హత్యకు కారకులైన వారిని వదిలిపెట్టం

ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్య చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం రాత్రి ఆలూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగ విషయంలో ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయని, ఆ వివాదం వల్లే ఈ హత్య జరిగి ఉండవచ్చని అన్నారు. హత్య సంఘటనపై క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ద్వారా విచారిస్తున్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన కొందరిపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, పోలీసులు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



బండారి ఈరన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూల లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, వాటి ద్వారా బాలబాలికలు, అసంఘటిత కార్మికులు, మహిళలు తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి సూచించారు. స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల న్యాయ సేవా పథకం, బాలల పరిరక్షణ పథకం, బాలికల సాధికారత పథకం వంటి ఎన్నో పథకాలు ఉన్నాయని, వాటి ద్వారా లబ్ధి పొందవచ్చని ఆయన తెలిపారు. బాల బాలికలు తమ హక్కులను తెలుసుకుంటే సమాజంలో అన్యాయాలకు గురి కాకుండా ఎదుర్కోడానికి వీలుంటుందని తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. మహిళలకు కోర్టులలో ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ, డీసీపీవో శారద, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు నజీమ కౌసర్, క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత చైల్డ్ వెల్ఫేర్ శాఖ, కార్మిక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు.

● **కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ:** నగరంలోని పలువురు కార్మికులకు గుర్తింపు కార్డులను, అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ కార్డులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పంపిణీ చేశారు. ఇంకా దరఖాస్తు చేసుకోనివారు కార్మిక శాఖ అధికారులను సంప్రదిస్తే వారికి కూడా కార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

నమో నారసింహా..



ఆలమూరులో పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా... అంటూ పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువు దీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామితో, ప్రహ్లాద వరద స్వామి ఉత్సవమూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో పూజలు రెండో రోజు అందుకున్నారు. అహోబిళ క్షేత్రం నుంచి మకర సంక్రాంతి రోజున పార్వేట పల్లకీ ప్రారంభమైన విషయం విదితమే. కాగా, రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో తిరుణాల ఏర్పాటు చేశారు. అంగళ్లల్లో రంగురంగుల బొమ్మలు, మట్టిగాజులు, ఇతర సామగ్రి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆలమూరులో బండలాగుడు పోటీలు : మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ బండలాగుడు పోటీల్లో ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. తిరుణాల సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు జగన్‌రెడ్డి అనే వ్యక్తి నగదు బహుమతులను ప్రదానం చేశారు.

భూమి విలువపై ఫైనల్ సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

పాణ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే మార్గ నిర్మాణ స్థలం కోసం చేపట్టిన స్థల పరిహారంపై భూములను ఫైనల్ సర్వే చేసినట్లు పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పాణ్యం పరిధిలో గోపీకృష్ణారావుకు చెందిన 28 సెంట్ల భూమిని అటవీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యానవన శాఖల అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ రైల్వే మార్గానికి చేపట్టే స్థలంలో ప్రభుత్వ రహదారి ఉండడంతో స్థలాన్ని రైల్వే మార్గానికి ఏర్పాటు చేసి రహదారికి రైతుల భూములు కేటాయించడానికి అవసరమైన సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఈ భూముల్లోని చెట్లు, పైపు లైనులు తదితర నిర్మాణాలకు పరిహారాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వే మార్గానికి అవసరమైన 98 సెంట్లు స్థలం సర్వే పూర్తి చేసినట్లు తెలి పారు. ఈ సర్వేతో కౌలూరు, నెరవాడ గ్రామాలకు రహదారితోపాటు వంద ఎకరాలకు రహదారి ఏర్పాటవుతుందన్నారు. అటవీశాఖ డీఆర్వో విజయ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి దివ్య, వీఆర్వో బీరేంద్ర, సర్వేయర్ లవకుమార్, ప్రశాంత్, కలాం పాల్గొన్నారు.

తాటి చెట్టును ఢీకొన్న టెంపో వాహనం

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- డ్రైవర్ నిద్ర మత్తు వల్లే ప్రమాదం



తాటి చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జయిన వాహనం

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తాటి చెట్టును టెంపో వాహనం ఢీకొనడంతో మైసూరుకు చెందిన ఐదుగురు యాత్రికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. బాధితులు, పెద్ద తుంబళం పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన గురురాజా కుటుంబ సభ్యులు మొత్తం 13 మంది టెంపో వాహనంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై గురువారం బయల్దేరారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆదోని మండలం పెద్దతుంబళం సమీపంలోకి రాగానే వేగంలో ఉన్న వీరి వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతోపాటు డ్రైవర్, ముందు సీటులో కూర్చున్న వారు ఇరుక్కుపోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న చుట్టు పక్కల పొలాల్లో వారు ప్రమాద స్థలానికి చేరుకొని వాహనంలో ఉన్న వారందరినీ బయటకు తీశారు. వీరిలో డ్రైవర్ సంతోష్, గిరిధర్, శాంతి, సుజాత, ప్రజ్ఞలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు రాయచూరుకు తరలించారు. గురురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిధర్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంతి, డ్రైవర్ సంతోష్

డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడు: శాంతి

ఒక రోజంతా వాహనం నడిపిన డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నందు వల్ల ప్రమాదం చోటు చేసుకుంది. విశ్రాంతి తీసుకోమని ఎన్ని సార్లు చెప్పినా డ్రైవర్ వినలేదు. ఆదోనిలో మాత్రమే కొద్దిసేపు నిద్రపోయాడు.

వేగంగా నడపొద్దు అన్నాం: గిరిధర్

మేము ప్రయాణిస్తున్న ఈ వాహనం మైసూరు నుంచి ప్రమాద స్థలం వరకు డ్రైవర్ వేగంగానే నడిపాడు. నిదానంగా వెళ్లమని చెప్పినా వినలేదు. అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ హానీ జరగలేదు. ఆ రాఘవేంద్ర స్వామి మా ప్రాణాలను రక్షించాడు.

ఇరిగేషన్ ఎస్ఈగా ద్వారకనాథ్ రెడ్డి



బాధ్యతలు చేపట్టిన ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి



సీఈ కబీర్ బాషాను కలిసిన ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈగా ద్వారకనాథ్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఏసీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న జలవనరుల శాఖలో ఈఈలకు ఎస్ఈ పదోన్నతి ఇస్తూ బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు డీఎస్ఈగా పని చేస్తున్న ద్వారకనాథ్ రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి ఇస్తూ కర్నూలు ఎస్ఈగా బదిలీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్న బి. బాలచంద్రారెడ్డి అదే కార్యాలయంలో డీఎస్ఈగా కొనసాగుతారు. కర్నూలు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ద్వారకనాథ్ రెడ్డి స్వస్థలం అనంతపురం. ఆయన అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువ కాలం పని చేశారు. తొలిసారిగా కర్నూలుకు బదిలీపై వచ్చారు. ఏప్రిల్ నెలలో ఆయన రిటైర్ అవుతారు. అంటే ఈ పదవిలో మూడు నెలలు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది. ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డిని పలువురు ఇంజనీర్లు, కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం ఆయన ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఓంకార క్షేత్రంలో వేలం పాటలు

బండిఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో వివిధ రకాల అమ్మకాలకు దేవస్థాన అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. శుక్రవారం నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఈవో నాగప్రసాద్ వేలం పాటలు నిర్వహిం చారు. టెంకాయలు, ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్స్ విక్రయ హక్కుకు, పాదరక్షల నిల్వ ఉంచే హక్కు కోసం వేలం పాటలు నిర్వహించారు. ఐస్‌క్రీమ్ విక్రయ హక్కుకు గత ఏడాది రూ.80వేలు రాగా, ఈ ఏడాది రూ.82వేలు లభించింది. పాదరక్షల నిల్వ ఉంచుటకు గత ఏడాది రూ.29500 రాగా, ఈ ఏడాది రూ.31 వేలు లభించినట్లు ఈవో తెలిపారు. టెంకాయలు, కూల్‌డ్రింక్స్ అమ్మకాలకు సరైన పాట లభించనందున సదరు వేలాలు వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ నిర్వహిస్తామని ఈవో చెప్పారు.

'నిందితులపై చర్యలు తీసుకుంటాం'

బండిఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సంతజూటూరు గ్రామ చందనపు చెరువు అలుగు ధ్వంసానికి పాల్పడిన వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. శుక్రవారం చెరువు ఏఈ అర్జున్ సింగ్, సర్పంచ్ రామచంద్రుడు, స్థానిక టీజీపీ అధ్యక్షుడు నాగేషారెడ్డి, టీడీపీ నాయకులు మోక్షేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, గ్రామ పెద్దలతో కలసి ధ్వంసానికి గురైన అలుగును పరిశీలించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, దీంతో రబీ సాగు రైతులకు చాలా కష్టాల వస్తాయని, కేసు నమోదు చేసి తగు చర్యలు చేపట్టాలని ఏఈ, గ్రామస్థులు ఎస్ఐని కోరారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

ఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాయక్, రజాక్ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహిం చిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే శానిటేషన్ కార్మికులకు నెలనెల సక్రమంగా వేతనాలు అందేలా చూడాలన్నారు. ఏజెన్సీల కాలపరిమితి ముగిసినప్పటికీ కొత్తగా వచ్చే ఏజెన్సీలు పాతవారినే కొనసాగించాలన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులకు వసతులు కల్పించాలన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

వెలుగోడు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ ఆంజనేయ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఏవో పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

కొత్తపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు బయోమెట్రిక్ ఆథంటికేషన్ చేసేందుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని దుద్యాల-2 సచివాలయంలో 27న గువ్వలకుంట్ల, 28న కొత్తపల్లి, 29న దుద్యాల-1, 30న నందికుంట సచివాలయాల్లో ఈ ఆధార్ క్యాంపులు ఉంటాయని చెప్పారు. గోకవరం సచివాలయం పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో శివపురం, 29, 30 తేదీల్లో గోకవరం గ్రామ సచివాలయంలో బయోమెట్రిక్ అథంటికేషన్ ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పై తేదీల్లో మొబైల్ సర్వీసులకు ఎలాంటి అంతరాయం కలగకుండా వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల వారితో సర్వీసు చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో కోరారు.

'రేపటి ర్యాలీని జయప్రదం చేయాలి'

ఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఆదివారం ఆత్మకూరులో నిర్వహించే ట్రాక్టర్, బైకు ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమ కర పత్రాలను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, రైతు సంఘం నాయకులు మాబాషా, వీరన్న, సురేంద్ర ఉన్నారు.

నందికొట్కూరు: రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ఇతర సమస్యలపై ఆల్ ఇండియా రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు ఆదివారం నిర్వహించే నిరసనలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో శుక్రవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి పక్కీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. రైతు సంఘం జిల్లా నాయకులు రాజు, సీఐటీయూ నాయకులు నాగన్న, నాయకులు కర్ణ, ఓబులేసు, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, బాలస్వామి, సామేలు, శ్రీనివాసులు, జయరాముడు, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు విధానాలను నిరసిస్తూ ఆదివారం పట్టణంలో బైక్, ట్రాక్టర్ ర్యాలీ చేపడుతున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. రైతు కార్మిక సంఘాల సమన్వయ కమిటి నాయకులు యేసురత్నం, తోట మద్దులు, బాలవెంకట్, లక్ష్మణ్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ జోక్యం అరికట్టాలి'

నంద్యాల రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాలలో పశువైద్య శిబిరం

పాములపాడు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇస్కాల గ్రామంలో పశువైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, ఏర్వ శ్రీనివాసరెడ్డి, లింగస్వామి ప్రారంభించారు. పశు వైద్యుడు డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలో 30 ఎద్దులకు, 25 గేదెలు, 20 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని చెప్పారు. రెండువేల గొర్రెలు, మేకలు, కోళ్ళకు నట్టల మందులు అందించారు. ప్రభుత్వ పథకాల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు.

'డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి'

నందికొట్కూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు అప్రమత్తంగా ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని డిపో మేనేజర్ నాగరాజు అన్నారు. శుక్రవారం డ్రైవర్స్ డే సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజు డ్రైవర్లకు గులాబీ పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బాలికా దినోత్సవం



నంద్యాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా వైద్యులు

మహానంది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. తిమ్మాపురంలోని జడ్పీ పాఠశాలలో శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ టీచర్ సావిత్రి ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత హాజరయ్యారు. బాలికలను రక్షించుకుందాం, చదివిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు.

పగిడ్యాల: పడమర నెహ్రూనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జరీనా, అంగన్‌వాడీ వర్కర్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు బస్టాండ్ వద్ద ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ ఓబులేసు, డాక్టర్ తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి ఆధ్వర్యంలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఈవోఆర్డీ సంజన్న, ఏపీఎం సబ్బయ్య ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, వెలుగు ఏపీఎం అంబమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. సంజీవ్‌నగర్ తండాలో నిర్వహించిన బాలికా దినోత్సవానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆత్మకూరు మండలంలోని 22 గ్రామాలకు గాను తండా గ్రామం గత పదేళ్లలో ఎస్టీ కమ్యూనిటీలో ఒక్క బాల్యవివాహం నమోదు కాని ఆదర్శ గ్రామంగా నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. దీంతో ఐసీడీఎస్, హోం శాఖ సంయుక్తంగా ప్రకటించిన ప్రశంసా పత్రాన్ని ఆ గ్రామ సర్పంచ్ నాగులు నాయక్‌కు అందించి సత్కరించారు. ఈవోఆర్డీ బాలు నాయక్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీడీపీ నాయకులు స్వామిరెడ్డి, సచివాయల సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు వెంకటరమణయ్య, ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు రుబినా అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల: స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ విభాగం అధ్యక్షురాలు డా.నెరవాటి అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డా. రవికృష్ణ, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ప్రముఖ సీనియర్ వైద్యుడు గెలివి సహదేవుడు, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షుడు డా.మధుసూదన్ రావు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డా.లక్ష్మి సౌజన్య, పూర్వ అధ్యక్షు రాలు డా.వసుధారాణి, ప్రముఖ వైద్యులు నాగమణి, నర్మద, సుసుమ, విజయకుమారి పాల్గొన్నారు. బాలికల ఆత్మగౌరవంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల ఏవో ప్రగతి, ఐఎంఏ మహిళా విభాగం వైద్య బృందం, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.విజయభాస్కర్‌రెడ్డి, నంద్యాల శాఖ కార్యదర్శి డా.షనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మిడుతూరులో ప్రతిజ్ఞ

● నంద్యాలలోని పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.శశికళ, మూలసాగరం అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యురాలు ఎం.దివ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో..



సంజీవ్‌నగర్ తండాలో సర్పంచ్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ



గడివేములలో..



ఎం. తిమ్మాపురంలో ఆటల పోటీలు

'పట్టాలు ఇవ్వాలి'

నంద్యాల రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న దళిత కూలీలకు పట్టాలు ఇవ్వాలని సాగు రైతులు నంద్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు వారు మాట్లాడుతూ భీమవరం, కానాల, రాయమాల్పురం, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలలో ఇరవై ఏళ్లుగా గా సీలింగ్ భూములు సాగు చేసుకుంటున్న దళిత వ్యవసాయ కూలీలకు పట్టాలతో పాటు పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరారు. విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రాజు, వెంకటేశ్వర్లు, రాయుడు, మరియమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 132కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఇంచార్జ్ ఏఈ గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఈ విద్యుత్ కోతలు ఉంటాయని తెలిపారు.

శివరాత్రి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి: ఈవో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేది వరకు జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దేవస్థానం పరిధిలోని పాతాళగంగ, డార్మిటరీలు, కళ్యాణకట్ట, శివదీక్షా శిబిరాలు, శౌచలయాలు, మల్లికార్జున సదన్ వసతి గృహం తదితర ప్రదేశాలను పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, ఏఈవో మల్లికార్జునరెడ్డి, శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ సి.అనిల్‌కుమార్, పీఆర్వో శ్రీనివాసరావు, పారిశుధ్య భద్రతా విభాగాల పర్యవేక్షకులు రాధాకృష్ణ, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

కంది పంట కోత ప్రయోగం

జూపాడుబంగ్లా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రంలో శుక్రవారం కందిపంట కోతను ఫారం ఏడీఏ అరుణలత ఆధ్వర్యంలో ప్రారంభించారు. క్షేత్రంలో మొత్తం 210 ఎకరాల్లో ఎల్‌ఆర్‌జీ -105 రకం కందిపంటను సాగుచేశామని ఏడీఏ తెలిపారు. పంటకోత పూర్తి అయిన తర్వాత ఏపీసీడ్స్ అధికారులు సాధించిన ఫౌండేషన్‌సీడ్స్ దిగుబడులను తీసుకెళ్లి ప్రాసెసింగ్ చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం తరుపున రాయితీతో ఖరీఫ్‌లో అందజేస్తారని అన్నారు. వ్యవసాయ అధికారులు కిశోర్, నిర్మల, శ్రావణి, తేజేశ్వరి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'చెంచులకు 170 గృహాలు మంజూరు'

కొత్తపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అరణ్యంలో ఉంటూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని గిరిపుత్రులకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం కింద 170 గృహాలు మంజూరు చేసినట్లు సోషల్ వెల్ఫేర్ డీడీ మండల ప్రత్యేక అధికారి చింతామణి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, హౌసింగ్ డీఈ నాగరాజుతో కలిసి చెంచులకు మంజూరైన గృహాలపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో గృహానికి రూ.2.39 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 140 మంది గిరిజనులకు మాత్రమే ఇంటి స్థలాలు ఉన్నాయని, ఇంకా 30 మందికి స్థల సేకరణ చేయాలని ఐటీడీఏ అధికారులను మండల ప్రత్యేక అధికారి ఆదేశించారు. గృహాలు కూడా లబ్ధిదారులే నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. దశల వారిగా నిర్మాణాలను బట్టి వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని చెప్పారు. హౌసింగ్ ఏఈ పాండురంగస్వామి నాయక్, ఏపీవో రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం శ్రీభ్రమరాంబమల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పుష్పాలంకరణ, పుష్పార్చన నిర్వహించారు. దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం పూజలు నిర్వహించింది.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

నంద్యాల కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ రామాలయంలో మహాసుదర్శన యాగ పూర్వక అష్టనాగ ఆశ్లేషా బలి పూజా సహిత సుబ్రమణ్య యాగంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. యడవల్లి కార్తికేయ శర్మ, భగవత్ సేవా సమాజ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అత్యధికంగా హాజరయ్యారు.

పని వేళలు పాటించాలి: డీఎల్‌డీవో

గోస్పాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు పని వేళలు పాటించాలని డీఎల్‌డీవో శివారెడ్డి సూచించారు. శుక్రవారం దీబగుంట్ల, జిల్లెల్ల, కానాలపల్లె, యాళ్లూరు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల ద్వారా చేయిస్తున్న సర్వేలు వ్యవసాయ సొసైటీ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వే మిస్సింగ్ సిటిజన్ సర్వే, ఎంఎస్‌ఎంఈ సర్వే ఈనెలాఖరు లోగా పూర్తి చేయాలన్నారు. హాజరు సమయానికి వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హామానుల్లా, ఇవోఆర్డీ నాగఅనసూయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పాణ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థిని వెంకటవైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27వరకు అనకాపల్లి (విశాఖపట్నం) లో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

అనధికార వెంచర్లపై దాడులు

నందికొట్కూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికారికంగా వెలిసిన వెంచర్లపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో కుడా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అనధికార లే అవుట్లపై మున్సిపల్ కమిషనర్ బేబి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి రంగస్వామి దాడులు నిర్వహించారు. వెంచర్లలో వేసిన రాళ్లను జేసీబీలతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా నమ్మరాళ్లను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి రంగస్వామి మాట్లడుతూ నోటీసులు జారీ చేశామని, లేఅవుట్లలో ఏర్పాటు చేసిన వాటిని ధ్వంసం చేశామన్నారు.

కర్పూరి ఠాగూర్‌కు నివాళి

ఆత్మకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్పూరి ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల కమిషన్ ఏర్పాటు చేయడంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాగూర్ కృషి చిరస్మరణీయమని జాతీయ బీసీ సంఘం నాయకులు రామకృష్ణ, రఘురాముడు, బాలస్వామియాదవ్ అన్నారు. సంఘం నాయకులు వీరన్న, తిమ్మయ్య, పెద్దనాగన్న, రవిప్రకాష్, రమణ, సుంకన్న, శివశంకర్ తదితరులు ఉన్నారు.

బాలోత్సవంలో ప్రతిభ

నంద్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నంది విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నంది బాలోత్సవం పోటీల్లో గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి 20బహుమతులు సాధించినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. శుక్రవారం విజేతలకు పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విజేతలను, ఉపాధ్యాయ బృందాన్ని గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అభినందించారు.

హెల్మెట్ ధరించాలి

● పోలీసుల బైకు ర్యాలీ

నంద్యాల క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని పోలీసు అధికారులు సూచించారు. జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీలు చేపట్టారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంవల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

బండిఆత్మకూరు: మండలంలోని సంతజూటూరు గ్రామంలో పోలీసులు హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరులో హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన రహదారుల వెంబడి హెల్మెట్ వాడకంపై పోలీసులు బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ఓబులేసు, ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో హెల్మెట్ ధరించి ఎస్ఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.



సంతజూటూరులో బైకు ర్యాలీ చేస్తున్న పోలీసులు

నంద్యాలను మరింత అభివృద్ధి చేస్తాం: మంత్రి



కుబ్రా మసీదు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

నంద్యాల కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజలు సక్రమంగా పన్నులు చెల్లిస్తే నంద్యాలను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు.నంద్యాల మున్సిపాలిటీలో శుక్రవారం మంత్రి ఫరూక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాలలో ఉన్న సుమారు 31 వార్డులలో రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మున్సిపాలిటీకి దాదాపు రూ.15 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, కోర్టుకు వెళ్లిన వారు పన్నులు చెల్లిస్తే నంద్యాల అభివృద్ధికి సహకరించిన వారవుతారని అన్నారు. దేవనగర్ నుంచి పద్మావతీనగర్ (కుందూ నది), శ్రీరామ థియేటర్ పక్కన ఒక బ్రిడ్జి కావాలని ప్రజలు కోరుతున్నారు, నిధులు వస్తే ఆ బ్రిడ్జిలు కడుతామని అన్నారు. నంద్యాలను శాటిలైట్ టౌన్‌గా తయారు చేయాలన్న ఉద్దేశ్యంతో నందమూరి నగర్‌లో, ఎన్‌జీవో కాలనీలో స్థలం కేటాయించినారన్నారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య, అయ్యపురెడ్డి గారు సహకారంతో ఈ స్థలాన్ని సేకరించారని చెప్పారు. ఈ సందర్భంగా వీరిని మంత్రి స్మరించుకున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

నంద్యాల రూరల్: నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలలోని అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ శంఖుస్థాపన, భూమిపూజ చేశారు. శుక్రవారం ఆయన 35వ వార్డు సలీంనగర్, 14వ వార్డు సరస్వతి నగర్, 25వ వార్డు నౌమాన్‌నగర్, ఎబిఎన్ చర్చి తదితర ప్రాంతాలలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు, పైపులైన్ల ఏర్పాట్లకు భూమిపూజ చేసి ప్రారంభించారు. 25 వవార్డు సాయిబాబానగర్ లోని కుబ్రామసీదు ఆధునికీరణకు మంత్రి ఫరూక్ శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఎన్‌ఎండీ ఫయాజ్, వార్డు ఇంచార్జి రాముడు, జ్యోతిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ రాష్ట్ర మహాసభల బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న టీడీపీ నాయకుడు చిన్నవెంకటస్వామి

నందికొట్కూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1వ తేదీన విశాఖపట్నంలో జరుగనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి నాగరాజు తెలిపారు. పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం మహాసభల బ్రోచర్లను టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆవిష్కరించారు. ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు స్వాములు పాల్గొన్నారు.

'ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు'

పాములపాడు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణ దారులు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మినా చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పాములపాడులోని మనగ్రోమోరుతో పాటు పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు.

మహిళను రక్షించిన పోలీసులు

నంద్యాల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పుష్పావతి అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేయగా రెండో పట్టణ పోలీసులు రక్షించిన ఘటన శుక్రవారం జరిగింది. పుష్పావతి కుటుంబ కలహాల కారణంగా ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తండ్రి లూకయ్య, పిల్లలు సాయంత్రం నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ ఇస్మాయిల్ మొబైల్ ట్రాకింగ్ ద్వారా మహిళ ఉన్న ప్రాంతాన్ని కనుగొన్నారు. వెంటనే పోలీసులను పంపి రైలు పట్టాలపై ఉన్న పుష్పావతిని రక్షించారు. ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి ఆరా తీయగా తనకు ముగ్గురు కుమార్తెలని, కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపిందని సీఐ తెలిపారు. ఆమె భర్త లింగమయ్యను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడతానని సీఐ సర్దిచెప్పి కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి, కూతుళ్ల వెంట ఇంటికి పంపారు.

'సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి'

వెలుగోడు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన ఎంఎస్‌ఎంఈ, పీఎన్‌ఎస్, ఎస్‌ఆర్‌ఏపీ జియో మ్యాపింగ్ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వెలుగోడు మండలంలోని 1,2,5వ సచివాలయాలను తనిఖీ చేశారు. గండిపేటలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చెంచు కాలనీలో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే అఖిలప్రియకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలుగుగంగ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగు గంగ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలని ఆళ్ల గడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. తెలుగుగంగ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్‌రెడ్డి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలుగుగంగ కాల్వ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, బ్లాక్ ఛానళ్లలో పూడికతీత, చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు తదితర వాటిపై ఎస్ఈ ఎమ్మెల్యేతో చర్చించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


చాగలమర్రిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధిలో ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను టీడీపీ నాయకులు మౌలాలి, అనిఫ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీలలో 28 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు రఫీ, అల్తాఫ్ తెలిపారు. మొదటి బహుమతి దాత అనిఫ్ రూ.20 వేలు, రెండో బహుమతి దాతలు తౌషిద్, ముస్తాక్‌లు రూ.10 వేలు, మూడో బహుమతి దాత సలీమ్ రూ.ఐదు వేలు నగదు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, టీడీపీ నాయకులు, విద్యా కమిటీ ఛైర్మన్ జల్సాగౌస్, గఫార్, షరిఫ్, షఫి, అబ్దుల్లా, దాతలు సోహెల్, సుబ్బన్న, గాలి దాదాపీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా మహన్యాస రుద్రాభిషేకం


వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో వాసవీమాతకు మహన్యాస రుద్రాభిషేకం, గణపతి హోమం చేశారు. మహిళలు సామూహికంగా అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని వెండి రథంలో కొలువుదీర్చి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

యూరియా కొరత.. ఆందోళనలో రైతులు


యూరియా కోసం రైతు భరోసా కేంద్రం వద్ద నిలిచిన వాహనాలు

రుద్రవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైతులను యూరియా కొరత వెంటాడుతోంది. శుక్రవారం రుద్రవరంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రుద్రవరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు యూరియా బస్తాల కోసం తరలివచ్చారు. యూరియా బస్తాలను వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల వారీగా పంపిణీ చేశారు. కొరతగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బోరుబావుల కింద, చెరువులు గంగ బ్లాక్‌ఛానెళ్ల కింద వరి పంటను సాగు చేశారు. వరిపంటలో కలుపు మందు చల్లేందుకు యూరియాను రైతులు ఉపయోగిస్తారు. ఒక్కసారిగా రుద్రవరం రైతు భరోసా కేంద్రం వద్దకు ట్రాక్టర్లు, ఆటోలతో ఎద్దులబండ్లతో రైతులు భారీగా తరలి వచ్చారు. ఉన్న యూరియా బస్తాలు వ్యవసాయసిబ్బంది రైతుల కు సర్దుబాటు చేశారు. కానీ ఇంకా కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ విషయంపై ఏవో నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా అందిస్తాం, రెండురోజుల్లో వ్యాగన్ వస్తుంది. ఎక్కడెక్కడ ఎంత అవసరమో నివేదికలు ఇవ్వమని వీఏఎలను ఆదేశించామన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత


బనగానపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, విద్యార్థులు

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ అందరి బాధ్యతని అంగన్‌వాడీ వర్కర్ నాగలక్ష్మి, జ్యోతి అన్నారు. శుక్రవారం చాగలమర్రి ఎయిడెడ్ రాఘవేంద్ర ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి, రమాదేవి, అంగన్‌వాడీలు సంజీవమ్మ, రెహెనా, అనూరాధ, నాగమణి, పద్మావతి, రజిని, విద్యార్థినులు పాల్గొన్నారు.

రుద్రవరం : బాలికల చదువు పల్లెకు వెలుగు అని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం విద్యాలయంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

శిరివెళ్ల : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని అన్నారు. మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ శిరివెళ్ల సూపర్‌వైజర్ సువర్ణలత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ వసుంధరమ్మ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు డాక్టర్ బడేసాహెబ్, మహమ్మద్‌గౌస్, సూర్యనారాయణరెడ్డి, బాబూనాథ్, సీతమ్మ, కౌసల్యాదేవి పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ఎంపీడీవో రమణ, ఏపీఎం శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, శైలజ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: బాల్య వివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం చింతలాయపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మీ, వసుంధర, ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం విజయలక్ష్మీ, లక్ష్మీప్రసన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు

- మామూళ్లకు అలవాటుపడిన వీఆర్వోలు
- ఆందోళనలో ప్రజలు



సంజామల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి పనికి వీఆర్వోలు ఓ రేటు పెట్టడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీపం ఉన్నగానే ఇల్లు చక్కబెట్టుకోలన్నా నానుడిని తూచా తప్పకుండా పాటిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. సంజామల మండలంలో ప్రక్కప్రక్క గ్రామాల్లో పనిచేసే ఆ వీఆర్వోలు మామూళ్లు తీసుకుంటేనే పనులు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చిన్న వయస్సు ఉన్న ఓ వీఆర్వో ఇప్పుడు కాకపోతే ఎప్పుడు సంపాదిస్తామంటూ పనికో రేటు పెట్టాడు. అదీగాక ఆయన పని చేసే గ్రామంలో అడిగినంత కాకపోయినా కాస్తో కూస్తో ఇచ్చి పని చేయించుకునేందుకు అలవాటు పడ్డారు. ఈ గ్రామంలో పోస్టింగ్ కోసం పైరవీలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ మహిళ తన అనుభవంలో ఉన్న స్థలం తన పేరిట అనుభవ ధృవీకరణ పత్రం మంజూరు చేయాలని కోరగా ఆ వీఆర్వో భారీగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమెతో అడ్వాన్సుగా కొంత మొత్తం లాగేశాడు. మిగిలిన మొత్తం ఇవ్వకపోవడంతో ఆ పత్రం అందజేయలేదని ఆ మహిళ వాపోతోంది. అలాగే రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో చేయడానికి, మ్యుటేషన్, చివరకు విద్యార్థులకు అందజేసే కుల ధ్రువీకరణ పత్రాలకు సైతం ఆ ఇద్దరు వీఆర్వోలు అందినంత దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రక్క గ్రామంలో పనిచేసే మరో వీఆర్వో బాగోతం పెద్దగానే ఉంది. ఇటీవల ఓ మహిళ భర్త చనిపోవడంతో సదరు భూమి వారసత్వంగా తన పేరుమీద మార్చాలని ఆశ్రయించగా ఏకంగా రూ. పదివేలు తీసుకొని మరింత డిమాండ్ చేసినట్లు ఆ మహిళ తెలిపింది. ఇది ఇలా ఉండగా బాగా చేతి వాటానికి అలవాటు పడ్డ వీఆర్వో ఆయన పని చేస్తున్న గ్రామంలో పెద్ద మొత్తంలో రాలకపోవడంతో బదిలీ కోసం పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సదరు వీఆర్వోలపై చర్యలు తీసుకొని తమను కాపాడాలని రైతులు , ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోలపై విచారణ చేపడుతాం. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం. రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఎంతటి వారినైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. కార్యాలయంలో ఏ వీఆర్వో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ఉండేలా చూస్తాం.

- అనిల్ కుమార్, తహసీల్దారు

కృష్ణా రివర్ బోర్డును శ్రీశైలంలో ఏర్పాటు చేయాలి


శిరివెళ్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

శిరివెళ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును(కేఆర్ఎంబీ) విజయవాడ, విశాఖపట్టణంలో కాకుండా కృష్ణానది పరివాహక ప్రాంతాలైన శ్రీశైలం, కర్నూలులో మాత్రమే ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు కమతం జయరామిరెడ్డి, కమతం సుబ్బారెడ్డి, తపసి శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ సాగునీటి సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ పుష్పకుమారికి రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర జలశక్తి శాఖతో సంప్రదించి రాయలసీమ ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

బనగానపల్లె: కర్నూలులోనే కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని శ్రీయాగంటి బసవేశ్వర రైతు సంఘం కార్యదర్శి కొండారెడ్డి శుక్రవారం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఏపీలోని కర్నూలు జిల్లాలో ఉన్న బోర్డు ఏర్పాటుకు ఇన్ని అవకాశాలు ఉన్నా కృష్ణానదితో సంబంధంలేని విశాఖపట్నంలో బోర్డు ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి కర్నూలులోనే కృష్ణానది యాజమాన్యబోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్లు తిమ్మరుసునాయుడు, ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెహ్రూ ఉన్నతపాఠశాలలో బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు జరుగకుండా ఎలా డ్రైవింగ్ చేయాలో వివరించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్లపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ ఒక వేళ ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సా విధానాలను గురించి వివరించారు. .కార్యక్రమంలో కరస్పాండెంట్ కమల్‌తేజారెడ్డి, బస్సు డ్రైవర్లు, పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


కొలిమిగుండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. చాగలమర్రి పట్టణంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పట్టణంలోని రహదారుల వెంట ద్విచక్ర వాహనంలో హెల్మెట్ ధరించి ప్రయాణం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి గుత్తి నరసింహులు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్యాపిలి: హెల్మెట్ వాడకం ప్రాణానికి శ్రేయస్కరమని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మధుసూదన్, లక్ష్మణరావు, నాగార్జున, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి, శిరివెళ్ల సీఐ వంశీధర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ ఆళ్లగడ్డ, శిరివెళ్లలో సీఐల ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐలు నగీనా, చిన్న పీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల,: మోటార్‌సైకిల్‌పై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. కొలిమిగుండ్లలో శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి హెల్మెట్ ధరించి, సీఐ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాజ్‌బాస్కర్, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు విష్ణు, మురళి, శ్రీరామ్, శివారెడ్డి పోలీసులు పాల్గొన్నారు.


ప్యాపిలిలో పోలీసుల బైక్ ర్యాలీ

ఎంఈవో-2గా అబ్రహాం బాధ్యతలు

బేతంచెర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బేతంచర్ల మండల విద్యాధికారి-2గా అబ్రహాం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలో ధరణిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సిటీ అబ్రహాంను మండల విద్యాధికారిగా నియమించింది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బేతంచెర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఆయన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, ఏఈవోలు మధు, మహ్మద్ ఉన్నారు.

అవుకు: యూరియాను ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మద్దిలేటిస్వామి , వెంకటేశ్వర ఏజెన్సీ ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

ఉయ్యాలవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. చెత్త సంపద కేంద్ర నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణ, ఏపీవో రవి ప్రకాష్ ఉన్నారు.

ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

● ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టించుకోని అధికారులు


ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన పాచి

బేతంచెర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వారానికి ఒక రోజు రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయాలి. కానీ బేతంచెర్ల మండలంలోని రేవల్లె గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకును పట్టించుకునే వారే కరువయ్యా రని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ట్యాంకు ను శుభ్రం చేయకపోవడంతో పాచి పేరుకుపోయిందని, నీరు తెచ్చుకునేందుకు వెళ్లి జారీ పడుతున్నారని వాపోతున్నారు. పురుగులు, పాచి ఉన్న నీరు తాగి రోగాల బారిన పడుతున్నా మని ప్రజలు ఆవేదన చెందు తున్నారు. ట్యాంకులను శుభ్రం చేయించి స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన అధికారులు, సర్పంచులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తు న్నారు. గ్రామంలో ట్యాంకు చుట్టూ శుభ్రం చేయించి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ట్యాంకు ప్లాట్‌ఫారంపై పేరుకుపోయిన పాచి

ఉత్తమ పంచాయతీగా కోవెలకుంట్ల

కోవెలకుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ గ్రామ పంచాయతీగా కోవెలకుంట్ల ఎంపికైనట్లు ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పాండురంగాపురం, కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసినట్లు ఈవోఆర్‌డి తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో ప్రశంసాపత్రాలు అందుకుంటారని ఆయన తెలిపారు.

'హమాలీల కూలి రేట్లు పెంచాలి'

డోన్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హమాలీ కూలి రేట్లను పెంచాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ సమీపంలోని సివిల్ సప్లయ్ స్టాక్ పాయింటు గోడౌన్ వద్ద హమాలీలతో కలిసి ఆందోళన నిర్వహించారు. స్టాక్ పాయింటులో పని చేసే హమాలీల కూలి రేట్ల ను పెంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

విద్యార్థులపై అధిక ఒత్తిడి

డోన్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నారాయణ, చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక పలు చోట్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి ఆయా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కమలాపురంలో పశు వైద్య శిబిరం

డోన్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు నిర్వహించారు. 39 లేగదూడలకు, 142 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు ఆయన తెలిపారు.

ప్యాపిలి: మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏడీ కిషోర్ కుమార్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పద్మావతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని నేలంపాడు, శెట్టివీడు గ్రామాల్లో పశువైద్యులు రవీంద్రారెడ్డి, దీపకుమారి, సాయిబాబా ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండల పరిధిలోని సౌదరిదిన్నెలో శుక్రవారం పశువైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ క్రిష్ణకుమార్ తెలిపారు.

కొలిమిగుండ్ల: పశువుల్లో తరచు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల, మీర్జాపురం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మహేశ్వరుడు, సునంద, మధు తదితరులు పాల్గొన్నారు

పోతుదొడ్డిలో ఘనంగా ఉరుసు

ప్యాపిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో శుక్రవారం హజరత్ మౌలాలిస్వామి ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే

చాగలమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు గ్రామంలో శుక్రవారం మండల సర్వేయర్ మద్దిలేటి ఆధ్వర్యంలో భూరీసర్వే పనులు ప్రారంభించారు. రీసర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద నేలంపాడు గ్రామాన్ని ఎంపిక చేశారని తెలిపారు. రోజుకు ఐదుమంది రైతులకు చెందిన పొలాల్లో భూ రీసర్వే చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్వో శ్రీనివాసులు, వీఎస్ వరప్రసాద్, శెట్టివీడు, గొడిగనూరు, మద్దూరు గ్రామాలకు చెందిన సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

26న మాంసం విక్రయాలు బంద్

బనగానపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 26న (ఆదివారం) జంతు వధ నిషేధించినట్లు గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఎక్కడ జంతువులు, పక్షులు వధించరాదని, విక్రయించరాదన్నారు. హోటళ్లలో మాంసంతో కూడిన పదార్థాలు విక్రయించరాదన్నారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

నేడు మంత్రి బీసీ రాక

అవుకు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీడీవో వెంగన్న శుక్రవారం తెలిపారు. అలాగే అవుకులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభిస్తారని, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై మంత్రి సమీక్షిస్తారని అన్నారు. అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 24(ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని నంద్యాల జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఛైర్మన్ ప్రజ్ఞ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎద్దులపాపమ్మ జూనియర్ కళాశాల మైదానంలోని కేవీకే ఇండోర్ స్టేడియంలో సెపక్ తక్రా రాష్ట్ర జట్టుకు శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు శిక్షణలో మెలకువలు నేర్చుకుని జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంత విద్యాసంస్థల అధినేత రామసుబ్బారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి సేవ


నందవరంలో పల్లకి సేవలో చౌడేశ్వరీమాత

బనగానపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

వచ్చే నెల 25 వరకు పంట నమోదుకు గడువు

కొలిమిగుండ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసుకున్న పంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వచ్చే నెల 25వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు శుక్రవారం వెల్లడించారు. పంట నమోదు పూర్తి చేసుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవా లని సూచించారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సం ప్రదించి, అవకాశం సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.